

*** గరిష్ఠం 29.5 కనిష్ఠం 21.4



ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.5050)	503.00 (120.0900)	నిల్	800
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	637.45 (2.66)	107	నిల్
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	98.65 (0.66)	96	నిల్

చికెన్ ధరలు | లైవ్ : రూ.136 | డ్రెస్ : రూ.194 | స్కిన్‌లెస్ : రూ.220



దేవరకొండ డివిజన్ నక్కలగండితండాలో స్ప్రింక్లర్లతో పత్తి పంటను కాపాడుకుంటున్న ఓ రైతు

ప్రత్యామ్నాయమే దిక్కు!

- నెలాఖరు వరకు వానలు లేకుంటే ప్రత్యేక పంటల ప్రణాళిక
- వారంలో చినుకు పడకుంటే పత్తిపై ప్రభావం
- తేలికపాటి వానలతో ప్రయోజనం శూన్యం
- వానాకాలం సాగుపై నీలి మేఘాలు
- వర్షపాతం లెక్కల నమోదులో గందరగోళం

నల్లగొండ, జూలై 13: ప్రతీ రోజు ఆకాశంలో మబ్బులు కమ్ముకోవడం.. చల్లటి వాతావరణం ఏర్పడటం మినహా భారీ వర్షాలు కురవడం లేదు. ఎక్కడో ఒక చోట తేలికపాటి వానలు కురుస్తున్నా పంటలకు ప్రయోజనం ఉండటం లేదు. చిన్నపాటి వర్షాలు సాగుకు అనుకూలంగా లేవు. ఇప్పటికే 90శాతానికి పైగా పంటల సాగు పూర్తికావాల్సి ఉండగా, 50శాతం లోపే సాగయ్యాయి. ఈ నెలాఖరు వరకు పత్తి విత్తనాలు విత్తుకునే అవకాశం ఉంది. అయితే నెలాఖరులోగా వర్షాలు లేకుంటే పత్తి సాగుపై ప్రభావం పడనుంది. దీంతో రైతులకు ప్రత్యామ్నాయ పంటలే శరణ్యం కానున్నాయి.

వర్షాలు అరకొరగా ఉండి, పత్తి, వరి సాగుకు పరిస్థితులు అనుకూలంగా లేకుంటే రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక పంటల ప్రణాళికవైపు అడుగులు వేసే అవకాశాలు ఉన్నాయి. దీంతో రైతులు తప్పనిసరి పరిస్థితుల్లో ప్రత్యామ్నాయ పంటలు సాగుచేయాల్సి ఉంటుంది. ఉమ్మడి జిల్లా పరిస్థితులు చూస్తే కేవలం కందులు మాత్రమే ప్రత్యామ్నాయ పంటగా సాగయ్యే అవకాశం ఉంది. నల్లగొండ జిల్లాలో 5.40లక్షల ఎకరాల పంటల విస్తీర్ణానికి రైతులు ఇప్పటి వరకు 3.56లక్షల ఎకరాల్లో పత్తి విత్తనాలు విత్తారు. ఇంకా 1.84లక్షల ఎకరాల్లో పత్తి విత్తనాలు విత్తాల్సి ఉండగా, పరిస్థితులు అందుకు అనుకూలంగా లేవు. నాగార్జునసాగర్ ప్రాజెక్టు డెడ్ స్టోరేజీకి చేరగా, ఆయకట్టుకు సాగునీటిని విడుదల చేసే పరిస్థితి లేదు. ఈ ప్రాంతంతో పాటు బోరు బావుల కింద, మెట్ట ప్రాంతంలో రైతులు వరి నార్లు పోశారు. 5లక్షల ఎకరాల్లో వరి సాగవుతుందని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేయగా, ఇప్పటి వరకు 2లక్షల ఎకరాల్లో నార్లు సిద్ధంగా ఉన్నాయి. కేవలం 10వేల ఎకరాల్లో మాత్రమే నాట్లుపడ్డాయి.

ఆందోళనకు గురవుతున్న రైతులు

దేవరకొండ డివిజన్‌లో పరిస్థితులు దారుణంగా ఉన్నాయి. వర్షాలు లేకపోవడం, నీటి వనరులు తగ్గడంతో కొంత మంది రైతులు పత్తి పంటను దక్కించుకునేందుకు స్ప్రింకర్లు ఏర్పాటు చేసుకున్నారు. వరి సాగుచేసే పరిస్థితి లేదు. కొంతమంది రైతులు ఉన్న కొద్దిపాటి భూమిలో కూరగాయలు సాగు చేసి జీవనం సాగిస్తున్నారు. వర్షాలు లేకపోవడంతో వరి, పత్తి పంటల సాగుపై తీవ్ర ప్రభావం కనిపిస్తోంది. మిగతా నియోజకవర్గాల్లోనూ బోరు బావుల కింద కొద్దిపాటి వరిసాగు మినహా వర్షాధారంగా సాగైన పత్తిపంట పూర్తిగా వాడుపట్టింది. వరుణుడు ముఖం చాటేయడంతో రైతులు గందరగోళంలోపడ్డారు. పత్తి రైతులు దుక్కుల దున్నకం మొదలుకుని విత్తనాలు, ఎరువులకు ఒక్కో ఎకరానికి వేల రూపాయలు పెట్టుబడులు పెట్టారు. వర్షాలు కురవకపోతే రైతులు అప్పుల ఊబిలో కూరుకపోయే ప్రమాదం ఉంది. ఈ నెలాఖరు వరకు వానలు లేకుంటే ప్రత్యామ్నాయ పంటలు సాగుచేసినా పెద్దగా ప్రయోజనం ఉండదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేవలం కందులు మాత్రమే సాగుచేస్తే ఆర్థిక పరిస్థితుల నుంచి గట్టెక్కేది ఎలా అని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఉమ్మడి జిల్లాలో రైతులు పత్తి, వరి పంటలకు అధిక ప్రాధాన్యం ఇస్తారు. ఈ నేపథ్యంలో భారీ వర్షాలు కురవకుంటే రైతులు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటారు.

గందరగోళంగా వర్షపాతం లెక్కల నమోదు

ఉమ్మడి జిల్లాలో సీపీవో కార్యాలయాలు అందజేస్తున్న వర్షపాతం లెక్కలు గందరగోళంగా ఉన్నాయి. వర్షపాతం లోటు తీవ్రంగా ఉన్నా, జూన్ నెలాఖరున, జూలై మొదటి వారంలో కురిసిన రెండు భారీ వర్షాలను పరిగణనలోకి తీసుకొని అధిక వర్షపాతం లెక్కలు చూపిస్తున్నారు. నల్లగొండ జిల్లాలో జూన్ 1 నుంచి ఈ నెల 13వ తేదీ వరకు 131.4మి.మీ వర్షపాతానికి గాను 184.4మి.మీల వర్షం కురిసినట్టు సీపీవో లెక్కలు ఉన్నాయి. అంటే 40మి.మీల అధిక వర్షంపాతం ఉన్నట్టు లెక్కలు చెబుతున్నాయి. దీంతో నల్లగొండ జిల్లాలో ఎలాంటి కరువు పరిస్థితులు లేవు అనేలా వర్షపాతం లెక్కలు ఉండటం ప్రతీ ఒక్కరిని ఆందోళనకు గురిచేస్తున్నాయి. మండల యూనిట్‌గా వర్షపాతం లెక్కలు తీస్తున్న అధికారులు వర్షపాతం నమోదును అస్తవ్యస్తంగా చేస్తునట్టు విమర్శలు వస్తున్నాయి. ఒక మండలంలో రెండు, మూడు గ్రామాల్లో వర్షం కురిస్తే ఆ మండలం మొత్తం వర్షం కురిసినట్లు లెక్కలు ఇస్తున్నారు. గ్రామం యూనిట్‌గా వర్షపాతం లెక్కించే పరికరాలు లేకపోవడంతో ఏటా వర్షపాతం లెక్కల వివరాలు సరిగా ఉండటం లేదనే చర్చ ఉమ్మడి జిల్లాలో ఉంది. ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో భారీ వర్షాలు లేక పంటల సాగులో ప్రతికూల పరిస్థితులు నెలకొనగా, వాతావరణశాఖ మాత్రం సరైన వర్షపాతం లెక్కలు నమోదు చేయకపోవడంతో రైతులను అయోమయానికి గురవుతున్నారు. నల్లగొండ జిల్లాలో ప్రస్తుతం 10మీటర్ల లోతుకు భూగర్భ జలాలు పడిపోయి బోరుబావుల్లో నీరు ఇంకి పూర్తిగా ఎండిపోయే పరిస్థితులు ఉన్నాయి. అయితే చిన్నపాటి, తేలికపాటి వర్షాలను వాతావరణశాఖ పెద్దగా చూపించడంతో చిత్రమైన పరిస్థితులు ఏర్పడ్డాయి.



తేలకంటిగూడెంలో బిందెలతో నీటి పోసి పత్తి పంటను కాపాడుకుంటున్న రైతు

నెలాఖరు వరకు పత్తి విత్తనాలు విత్తవచ్చు



ప్రస్తుతం వర్షాలు లేకపోవడంతో ఇబ్బందికర పరిస్థితులు ఉన్నాయి. వారంలోగా వర్షాలు కురవకుంటే పత్తి సాగుపై ప్రభావం చూపనుంది. వర్షాలు సమృద్ధిగా కురిస్తే ఈ నెలాఖరు వరకు పత్తి విత్తనాలు విత్తవచ్చు. వర్షాలు కురుస్తున్నాయని వాతవారణ శాఖ పేర్కొంటున్నందున ముున్ముందు వర్షాలు పడితే పత్తి చేలకు ప్రయోజనం ఉంటుంది. ఈ నెలాఖరు వరకు భారీ వర్షాలు కురవకుంటే ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ప్రత్యామ్నాయ పంటల ప్రణాళికను రూపొందిస్తాం.

పి.శ్రవణ్‌కుమార్, నల్లగొండ జేడీఏ

ఆర్టీసీ బలోపేతానికి చర్యలు



మహాత్మా జ్యోతిబాపూలే, సావిత్రిబాయిపూలే విగ్రహాలను ఆవిష్కరించిన మంత్రులు పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

- దసరాలోగా ఉమ్మడి జిల్లాకు 30 డీలక్స్, 30 ఎక్స్‌ప్రెస్ బస్సులు
- నార్కెట్‌పల్లి డిపోకు పునర్‌వైభవం తీసుకొచ్చేందుకు కృషి
- రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

నల్లగొండ, జూలై 13: రాష్ట్రంలో నూతన ప్రభుత్వం ఏర్పాటయ్యాక నష్టాల్లో నడుస్తున్న ఆర్టీసీ సంస్థను బలోపేతం చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని బస్సు డిపోలో నల్లగొండ-హైదరాబాద్‌కు ఒక ఏసీ బస్సు నాలుగు డీలక్స్ బస్సులను, మరో పల్లె వెలుగు బస్సును మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, ఆర్టీసీ సంస్థ, కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటోందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటయ్యాక 48గంటల లోపే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించామన్నారు. నూతనంగా 1,000 బస్సులు కొనుగోలు చేశామని, మరో 1,500 బస్సులను కొనుగోలు చేసేందుకు ఆర్డర్ ఇచ్చామన్నారు. వచ్చే దసరా నాటికి జిల్లాకు 90 డీలక్స్ బస్సులు, మరో 30 ఎక్స్‌ప్రెస్ బస్సులను మంజూరు చేస్తామన్నారు. అలాగే హైదరాబాద్, తిరుపతికి ఏసీ బస్సులను మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. నార్కెట్‌పల్లి బస్సు డిపోకు పునర్ వైభవాన్ని తీసుకువచ్చి అక్కడి నుంచి అన్ని ప్రాంతాలకు బస్సులను నడిపేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్మికుల సంక్షేమంలో భాగంగా 21శాతం డీఏ ఇచ్చామని, రూ.280 కోట్ల బకాయిలో రూ.80కోట్లు ఇచ్చామని, రూ.200కోట్లు నెలాఖరునాటికి వారి ఖాతాల్లో జమ చేస్తామని మంత్రి వెల్లడించారు. నూతనంగా 3,035 ఉద్యోగాలను భర్తీచేస్తామన్నారు. అన్ని జిల్లాల నుంచి హైదరాబాద్‌కు ఏసీ బస్సులు నడపాలని నిర్ణయం తీసుకున్నామని, అవసరమైతే అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి ఏసీ బస్సులను నడుపుతామన్నారు. ముందుగా జిల్లా కేంద్రాల నుంచి ఏసీ బస్సు సౌకర్యాన్ని కల్పిస్తున్నట్టు తెలిపారు. రాష్ట్రంలోని అన్ని మండల కేంద్రాల నుంచి జిల్లా కేంద్రాలకు, జిల్లా కేంద్రాల నుంచి హైదరాబాద్‌కు బస్సులు నడిపి ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానానికి చేరవేస్తామన్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటి వరకు సుమారు 70 కోట్ల మంది మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించిందన్నారు. అప్పుల్లో ఉన్న ఆర్టీసీని రక్షించేందుకు ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటోందన్నారు. హైదరాబాద్ తర్వాత అతి పెద్ద జిల్లా ఉన్న నల్లగొండకు ప్రత్యేకంగా 25 బస్సులతో పాటు, నార్కెట్‌పల్లి ఆర్టీసీ డిపోకి పునర్‌వైభవం తీసుకురావాలని, ఉమ్మడి జిల్లా మొత్తానికి 100 బస్సులు మంజూరు చేయాలని మంత్రి పొన్నంను కోరారు.

బీసీలకు ప్రభుత్వం పెద్దపీట

నల్లగొండ టౌన్: రాష్ట్రంలో బీసీలకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. జిల్లా కేంద్రంలో బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బీసీ భవన్ వద్ద ఏర్పాటుచేసిన మహాత్మ జ్యోతిబాపూలే, సావిత్రిబాయిపూలే విగ్రహాలను మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సావిత్రిబాయి పూలే చరిత్రను ప్రతీ ఒక్కరు తెలుసుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీ కార్పొరేషన్‌కు నిధులు మంజూరు చేసిందన్నారు. బలహీనవర్గాలకు మంచి జరగాలనే ఆలోచనతో కులగణను చేపట్టేందుకు నిర్ణయించామని, అందుకు రూ.150కోట్లు కేటాయించామన్నారు. కుల వృత్తులను ప్రోత్సహించేందుకు, బీసీ పారిశ్రామికవేత్తలకు సహకారం అందించేందుకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు. బీసీ విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను దశలవారీగా విడుదల చేస్తున్నామన్నారు. గురుకులాలు, వసతి గృహాల విద్యార్థులకు అన్ని వసతులు కల్పిస్తున్నామని, ఇటీవలే గురుకులాల్లో 6,000 మందిని శాశ్వతంగా నియమించామన్నారు. అమరవీరుల కుటుంబాలకు రూ.25వేల పెన్షన్ త్వరలోనే ప్రభుత్వం ఇవ్వనుందని, అదేవిధంగా 250 గజాల ప్రభుత్వ స్థలం ఇచ్చేందుకు నిర్ణయించామన్నారు. మంత్రి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో ఎస్‌ఎల్‌బీసీ కాలనీ వద్ద ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌ను నిర్మించనున్నట్టు తెలిపారు. బీసీ గురుకులాలు, సంక్షేమ హాస్టళ్లలోని సమస్యల పరిష్కారం, ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు తన నిధుల నుంచి రూ.1.20కోట్లు మంజూరు చేస్తానన్నారు. కార్యక్రమాల్లో జాతీయ బీసీ సంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్, జిల్లా బీసీ సంఘం అధ్యక్షుడు చక్రహరి రామరాజు, అదనపు కలెక్టర్ టీ.పూర్ణచంద్ర, మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, వైస్ చైర్మన్ అబ్బాగోని రమేష్‌గౌడ్, ఆర్టీసీ ఆర్‌ఎం రాజశేఖర్, డిప్యూటీ ఆర్‌ఎం శివశంకర్, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



ఆర్టీసీ నూతన బస్సును ప్రారంభిస్తున్న మంత్రులు

ఖాళీలను పదోన్నతులతో భర్తీ చేయాలి



సమావేశంలో డీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మాట్లాడుతున్న సోమయ్య

డీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సోమయ్య

నల్లగొండ, జూలై 13: విద్యాశాఖలో పదోన్నతులు, బదిలీలతో మిగిలిన ఉపాధ్యాయ ఖాళీలను మరోమారు పదోన్నతుల ద్వారా నింపాలని డీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.సోమయ్య అన్నారు. శనివారం స్థానిక డీటీఎఫ్ జిల్లా కార్యాలయంలో జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. బదిలీ అయిన సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులందరినీ వెంటనే రిలీవ్ చేయాలని డిమాండ్ చేశారు. సీఎం హామీ ఇచ్చినట్లు ప్రతీ పాఠశాలకు స్కావెంజర్లను వెంటనే నియమించాలన్నారు. ప్రభుత్వ, పంచాయతీరాజ్ యజమాన్యాల సర్వీస్ రూల్స్‌కు ఏ అడ్డంకి లేదని, వెంటనే ఎంఈవోలుగా పదోన్నతులు కల్పించాలన్నారు. సర్వీస్ రూల్స్ సవరించి ఉపాధ్యాయులకు జూనియర్ లెక్చరర్లుగా, డైట్ లెక్చరర్లుగా పదోన్నతులు కల్పించాలన్నారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి.వెంకులు మాట్లాడుతూ, ఇటీవల బదిలీల్లో స్పౌజ్ సర్టిఫికేట్లను దుర్వినియోగం చేసినవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బదిలీలు, పదోన్నతలు పూర్తయ్యాక కొంత మంది నిబంధనలకు విరుద్ధంగా మాడిఫికేషన్‌కు ప్రయత్నిస్తున్నారని, దీన్ని విద్యాశాఖ అనుమతించవద్దన్నారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు ఎండీ.ఖుర్షీద్‌మియా, రాహెల్ కుమారి, డి.గణేష్, బి.వెంకటేశం, ఎం.నాగయ్య, ఏడుకొండల్, వెంకటేశ్వర్లు, మోహన్‌రావు, అంజయ్య, వీరయ్య, తదితరులు పాల్గొన్నారు.

సరిహద్దుల్లో పటిష్ఠ నిఘా ఉంచాలి : ఎస్పీ

దామరచర్ల, జూలై 13: సరిహద్దుల్లో పటిష్ఠ నిఘా ఉంచాలని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అన్నారు. శనివారం మండల పరిధిలోని అంతర్రాష్ట్ర వాడపల్లి చెక్‌పోస్టును ఎస్పీ తనిఖీ చేశారు. పక్క రాష్ట్రాల నుంచి గంజాయి, మాదకద్రవ్యాలు, పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా జరగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను సూచించారు. ఎప్పటికప్పుడు వాహనాలు తనిఖీ చేయాలన్నారు. ఆయన వెంట డీఎస్పీ రాజశేఖర్‌రాజు, ఎస్ఐ ఇరుగు రవి, తదితరులు ఉన్నారు.

థర్మల్ ప్లాంట్‌ను సందర్శించిన ఎస్పీ

మండల పరిధిలోని వీర్లపాలెం శివారులో నిర్మాణంలో ఉన్న యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌ను ఎస్పీ శరత్‌చంద్ర పవార్ సందర్శించారు. పరిశ్రమలోని నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. అనంతరం పరిశ్రమ నిర్మాణ మ్యాప్‌లను పరిశీలించి పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. పరిశ్రమలో చేపట్టాల్సిన భద్రత చర్యలపై పోలీసు అధికారులకు పలు సూచనలు చేశారు. ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండి భద్రత చర్యలతోపాటు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట పరిశ్రమ సీఈ సమ్మయ్య, ఇతర శాఖల అధికారులు ఉన్నారు.





వాడపల్లి చెక్‌పోస్ట్, యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

రూ.35లక్షల విలువైన గంజాయి పట్టివేత

•6లో..

హామీల అమలులో ప్రభుత్వం విఫలం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ నేత గోలి మధుసూదన్‌రెడ్డి

బీజేపీ నేత గోలి మధుసూదన్‌రెడ్డి

మాడ్గులపల్లి, జూలై 13: ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయలేదని కిసాన్‌మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు, బీజేపీ కేరళ రాష్ట్ర ఇన్‌చార్జి గోలి మధుసూదన్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో అధికారంలోకి వస్తే ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామన్న సీఎం రేవంత్‌రెడ్డి వాటిని అమలుచేయాలేదన్నారు. రైతులకు ఏకకాలంలో రూ.2లక్షల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. రైతు భరోసా కింద ఎకరానికి రూ.15వేలు ఇస్తామని చెప్పి ఇప్పటి వరకు సీజన్ ప్రారంభమైనా ఎవ్వరికీ నగదు జమచేయలేదన్నారు. రైతు భరోసాపై అభిప్రాయాలు తీసుకొని డబ్బు ఇస్తామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రధాని మోదీ వరికి మద్దతు ధరను రూ.2,300కు పెంచి రైతులను ఆదుకునేందుకు ప్రయత్నిస్తున్నారని అన్నారు. తుక్కుగూడలో కాంగ్రెస్ ప్రకటించిన రైతు డిక్లరేషన్‌ను అమలు చేయాలని లేదంటే బీజేపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు గడ్డం వెంకట్‌రెడ్డి, నవీన్‌రెడ్డి, రామలింగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత



పారిశుధ్య కార్మికులతో కలిసి సహపంక్తి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

- ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి
- పారిశుధ్య కార్మికులతో సహపంక్తి భోజనం

మిర్యాలగూడ, మిర్యాలగూడటౌన్, జూలై 13: పరిసరాల పరిశుభ్రత ప్రతీ ఒక్కరి బాధ్యత అని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. 'నేను నా మిర్యాలగూడ' కార్యక్రమంలో భాగంగా శనివారం పట్టణంలో మూడో రోజు స్వచ్ఛందంగా పారిశుధ్య పనుల కార్యక్రమం కొనసాగింది. పలు వార్డుల్లో కౌన్సిలర్లు, పార్టీ ఇన్‌చార్జీలు మునిసిపల్ కార్మికులతో కలిసి పారిశుధ్య పనులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా జల, వాయు కాలుష్యాన్ని నివారించవచ్చన్నారు. వర్షాకాలంలో మురుగు నీరు నిలిచి దోమలు వృద్ధి చెందుతాయని, విషజ్వరాలు ప్రబలే అవకాశం ఉందన్నారు. ఆరోగ్యకరమైన సమాజం కోసం పట్టణాన్ని పరిశుభ్రంగా, సుందరంగా తీర్చిదిద్దుకోవాల్సిన అవసరం ఉందన్నారు. హౌసింగ్‌బోర్డు కాలనీలో పారిశుధ్య కార్మికులతో కలిసి ఎమ్మెల్యే సహపంక్తి భోజనం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షుడు ముదిరెడ్డి నర్సిరెడ్డి, కౌన్సిలర్లు బండి యాదగిరిరెడ్డి, చల్లా నాగమ్మ, మంత్రాల రుణాల్‌రెడ్డి, తలకోన సుజాత, నాయకులు మాలి శ్రీనివాసరెడ్డి, షట్టపాక శ్రీనివాస్, ఎంఏ సలీం, మన్నెం కృష్ణారెడ్డి, గార్లపాటి శేఖర్‌రెడ్డి, సతీష్‌రెడ్డి, బీఎల్‌ఆర్ బ్రదర్స్, సుల్తానా, ఆరీఫ్, శ్రీధర్ రెడ్డి, నిరంజన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కళాశాలలో ఫర్నీచర్ కొరత

- నేలపైనే కూర్చుంటున్న అధ్యాపకులు
- ఖాళీగా పలు పోస్టులు

•7లో..

విజ్ఞానం.. వినూత్నం

- నూతన ఆవిష్కరణలు, పరిశోధనలకు వీవీఎం పోటీలు
- శారీరక దృఢత్వంకోసం ఆటలు • షెడ్యూల్ జారీ

•7లో..

రూ.35లక్షల విలువైన గంజాయి పట్టివేత

● ఒకరి అరెస్ట్, రెండు కార్లు స్వాధీనం ● ఎస్పీ శరత్‌చంద్ర పవార్

మిర్యాలగూడ, జూలై 13: వాహన తనిఖీల్లో రూ.35లక్షల విలువైన గంజాయిని తరలిస్తుండగా పట్టుకుని ఒకరిని అరెస్ట్ చేసినట్లు ఎస్పీ శరత్‌చంద్ర పవార్ తెలిపారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలంలోని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గంజాయి రవాణా చేస్తున్నారన్న సమాచారం మేరకు మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్ ఆధ్వర్యంలో శుక్రవారం గాలింపు చర్యలు చేపట్టారు. పట్టణ శివారులో అనుమానాస్పదంగా కనిపించిన మహేంద్ర బొలెరో వాహనం (టీఎస్ 08డీ0433), మహేంద్ర మేరాజ్ (టీఎస్ 29ఎఫ్ 6434) రెండు కార్లను తనిఖీ చేసేందుకు వెళ్లగా అందులో ఉన్న నలుగురు వ్యక్తులు పారిపోగా, ఒకరిని అదుపులోకి తీసుకున్నట్టు తెలిపారు. సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండలం లాల్‌సింగ్‌తండాకు చెందిన భూక్యా రామును అదుపులోకి తీసుకున్నారు. వాహనాలను తనిఖీ చేయగా 140.585కిలోల గంజాయి పట్టుబడినట్లు తెలిపారు. నిందితుడు రామును విచారించగా, మరో నలుగురు వ్యక్తుల ప్రమేయం ఉన్నట్లు తెలిసిందని పేర్కొన్నారు. సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండలంలోని బంజారాహిల్స్‌కు చెందిన నూనావత్ జగన్, జల్‌మాల్‌కుంటతండాకు చెందిన నూనావత్ మంచ్యానాయక్, లాల్‌సింగ్ తండాకు చెందిన ఆంగోతు నాగరాజు, ఖమ్మం జిల్లా జూబ్లీపురకు చెందిన బాణోతు సాయిలు అనే పాత నేరస్థుల ప్రమేయం ఉందని తెలిపారు. వీరిపై వివిధ పోలీస్‌స్టేషన్లలో గతంలో కేసులు నమోదైనట్లు చెప్పారు. నూనావత్ జగన్, మంచ్యా నాయక్ ఆదేశాల ప్రకారం హైదరాబాద్ నుంచి ఒకటి, సూర్యాపేట నుంచి మరో వాహనంలో బయలుదేరారు. దేవరకొండ ఏరియాలో మద్దిమడుగు వెళ్లే దారిలో నిర్జీవ ప్రదేశంలో గుర్తుతెలియని వ్యక్తులు సరఫరా చేసిన గంజాయిని రెండు వాహనాల్లో లోడు చేసుకుని సూర్యాపేట వైపునకు తరలిస్తున్నారు. చివరికి మిర్యాలగూడ పట్టణ శివారులో వాహన తనిఖీల్లో పట్టుబడినట్టు ఆయన తెలిపారు. గంజాయి అక్రమ రవాణాలో ఐదుగురు నిందితుల్లో జగన్, మం చ్యానాయక్, నాగరాజు, సాయిలు అనే నలుగురు పరారీలో ఉండగా, భూక్యా రామును అరెస్ట్ చేసి గంజాయి సరఫరా చేస్తున్న రెండు ఖరీదైన కార్లను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. పట్టుబడిన కార్లలో బొలెరో వాహనం హైదరాబాద్ ట్రావెల్స్‌లో సెల్ఫ్ డ్రైవింగ్ పేరుతో అద్దెకు తెచ్చుకున్నట్లు తెలుస్తోంది. మరొకటి నిందితుల్లో ఒకరైన మంచ్యానాయక్‌దిగా గుర్తించినట్లు తెలిపారు. పరారీలో ఉన్న నిందితుల కోసం ముగ్గురు సీఐలతో మూడు ప్రత్యేక బృందాలతో గాలింపు ముమ్మరం చేసినట్లు తెలిపారు. సమావేశంలో డీఎస్పీ రాజశేఖర్‌రాజు, వన్‌టౌన్ సీఐ సుధాకర్, హాలియా సీఐ జనార్ధన్, ఎస్ఐ సతీష్, వన్‌టౌన్ ఎస్ఐ రవి పాల్గొన్నారు.



విజ్ఞానం.. వినూత్నం

● నూతన ఆవిష్కరణలు, పరిశోధనలకు వీవీఎం పోటీలు
● శారీరక దృఢత్వంకోసం ఆటలు ● షెడ్యూల్ జారీ

విద్యార్థుల్లో ఆవిష్కరణలు, పరిశోధనలపై ఆసక్తి పెంచేందుకు ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నాయి. చదువుతోపాటు విజ్ఞానం, క్రీడల్లో పాల్గొనేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాయి. శారీరక దృఢత్వం, చురుకుదనం, మానసికోల్లాసం కల్పించే ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నాయి. ఇందుకోసం విద్యార్థి విజ్ఞాన్ మంథన్ పోటీలు నిర్వహించనున్నాయి.

● భువనగిరి టౌన్

విద్యా సంవత్సరం ప్రారంభమై సుమారు నెల రోజులు గడుస్తోంది. ఓ వైపు ప్రవేశాలు, మరోవైపు పాఠ్యాంశాల బోధన ముమ్మరంగా కొనసాగుతోంది. దీంతో విద్యార్థుల్లో చదువుపై ఆసక్తిని పెంపొందిస్తూనే వారిలో ఉన్న ప్రతిభను వెలికి తీసే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్యాచరణ ప్రారంభించాయి. అభివృద్ధికి కీలకమైన సైన్స్, పరిశోధనలపై విద్యార్థులను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం, విద్యార్థుల్లో శారీరక దృఢత్వం, చురుకుదనం, మానసికోల్లాసం కల్పించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం 2024-25 విద్యా సంవత్సరానికి వేర్వేరు కార్యాచరణలు ప్రకటించాయి. దీంతో తరగతి గదుల్లోని ప్రతిభగల విద్యార్థుల్లో నూతన ఉత్సాహం నెలకొన్నది. అయితే సృజనాత్మకత ఉన్న విద్యార్థులను ఉపాధ్యాయులు గుర్తించి ప్రోత్సహిస్తేనే ప్రభుత్వాల లక్ష్యాలు నెరవేరడంతోపాటు దేశానికి ప్రతిభగల యువ తరం లభించే అవకాశాలు మెరుగవుతాయి.

వీరు అర్హులు

ప్రతీ సంవత్సరం ఓ జాతీయస్థాయి శాస్త్రవేత్త పేరిట పోటీలు నిర్వహిస్తుండటం ఆనవాయితీ. ఈ మేరకు 2024-25 విద్యాసంవత్సరానికి ప్రముఖ వృక్షశాస్త్ర వేత్త బీర్బల్ సాహ్ని పేరిట పోటీలు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో 6వ తరగతి నుంచి 11వ తరగతి వరకు చదువుతున్న స్టేట్ బోర్డు, సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ విద్యార్థులు అర్హులు. ఆసక్తిగల విద్యార్థులు సంబంధిత వెబ్‌సైట్‌లో రూ.200 రుసుము చెల్లించి సెప్టెంబర్ 15లోపు దరఖాస్తు చేసుకోవాలి.

బహుమతులు ఇలా

ఆన్‌లైన్‌లో జరిగే పరీక్షల్లో గణిత, సామాన్య పాఠ్యపుస్తకాల్లోని 50 శాతం అంశాలు, విజ్ఞాన శాస్త్రంలో భారత దేశ కృషి, శాస్త్రవేత్తల జీవిత చరిత్రకు సంబంధించి 20శాతం చొప్పున, లాజికల్ రీజనింగ్ ప్రశ్నలు 10శాతం ఉంటాయి. తెలుగు, హిందీ, ఇంగ్లీష్ భాషలలో పరీక్షలు ఉంటాయి. పరీక్షల్లో పాల్గొన్న విద్యార్థులందరికీ ధ్రువపత్రం, జ్ఞాపికలు అందజేస్తారు. ప్రతిభ చూపిన వారికి నగదు బహుమతులు అందిస్తారు. మొదటి బహుమతిగా రూ.5వేలు రెండో బహుమతిగా రూ.3వేలు, తృతీయ బహుమతిగా రూ.2వేలు ఇస్తారు.



జాతీయ స్థాయిలో ప్రతిభ చూపిన ముగ్గురికి వరుసగా రూ.25వేలు, రూ.15వేలు, రూ.10వేల చొప్పున ఇస్తారు. దేశంలోని పరిశోధనా, అభివృద్ధి సంస్థలు సందర్శించేలా అవకాశాలు కల్పిస్తారు. అలాగే నెలకు రూ.2వేల చొప్పున ఏడాదిపాటు 'భాస్కరా' స్కాలర్‌షిప్ అందిస్తారు.

షెడ్యూల్ ఇలా..

దరఖాస్తుల గడువు సెప్టెంబరు 15, జిల్లాస్థాయిలో మోడల్ టెస్టు సెప్టెంబరు లేదా అక్టోబరులో, ప్రధాన పరీక్ష అక్టోబరు 23 లేదా 27, ఫలితాలు సెప్టెంబరు 15న, రాష్ట్రస్థాయి పరీక్షా డిసెంబర్ 8, 15, 22, జాతీయ స్థాయి పరీక్ష 17, 18 మే 2025 నిర్వహించనున్నారు.

విద్యార్థి విజ్ఞాన్ మంథన్ పోటీలు

విద్యార్థుల్లో నూతన ఆలోచనలు, పరిశోధనాసక్తిని, ఆవిష్కరణలను వెలికితీసే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం పరిధిలోని విజ్ఞాన భారతి, విజ్ఞాన ప్రసార్, నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ ట్రైనింగ్ (ఎన్‌సీఈఆర్‌టీ) సంయుక్తంగా పోటీపరీక్షలు నిర్వహించేందుకు 2024-25 విద్యా సంవత్సరానికి షెడ్యూల్‌ను జారీచేశాయి. ఈ మేరకు విద్యార్థి విజ్ఞాన్ మంథన్ (వీవీఎం) ఆన్‌లైన్‌లో విద్యార్థుల గురించి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. పాఠశాల స్థాయి నుంచి జాతీయస్థాయి వరకు వివిధ దశలలో పోటీలు జరగనున్నాయి. కంప్యూటర్ వినియోగం, స్మార్ట్‌ఫోన్ వాడకంపై అవగాహన ఉన్న ఆరో తరగతి నుంచి 11వ తరగతి చదువుతున్న ప్రభుత్వ, ప్రైవేటు విద్యార్థులందరూ పోటీల్లో పాల్గొనవచ్చు.

పాఠశాలల క్రీడల షెడ్యూల్

పెరుగుతున్న పోటీతత్వం, ఉజ్వల భవిష్యత్‌కు చదువే ప్రామాణికం కావడంతో తల్లిదండ్రులు పిల్లలను తరగతి గదులు, పాఠ్యపుస్తకాలకే బందీలుగా చేస్తున్నారు. ఈ విధానం ప్రభుత్వ పాఠశాలలతో పోలిస్తే ప్రైవేటు పాఠశాలల్లో మితిమీరుతున్నదనేది బహిరంగ రహస్యం. ఫలితంగా పలువురు విద్యార్థులు బాల్యదశలోనే ఊబకాయానికి లోనవుతుండగా మరికొందరు చురుకుదనం, శారీరక ఆరోగ్యాన్ని కోల్పోతున్నారు. దీంతో విద్యార్థులను చదువుతోపాటు ఆసక్తిగల అన్నిరంగాల్లో ప్రోత్సహిస్తూ మానసికోల్లాసం కల్పించే లక్ష్యంతో ప్రభుత్వం ప్రతీ సంవత్సరం పలురంగాల్లో పోటీలను నిర్వహిస్తున్న విషయం విధితమే. ఈ మేరకు విద్యార్థులు ఆసక్తి చూపే పాఠశాల ఆటల పోటీల షెడ్యూల్‌ను 2024-25 విద్యాసంవత్సరానికి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) జారీచేసింది. పాఠశాలస్థాయి నుంచి జాతీయస్థాయి వరకు పోటీలు జరగనున్నాయి.

విద్యార్థుల ఆసక్తికి గీటురాయి

వీవీఎం పోటీలు విద్యార్థుల పరిశోధన, నూతన ఆవిష్కరణల ఆసక్తికి గీటురాయి. పోటీలను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని తమలో దాగి ఉన్న సృజనాత్మకతను బాహ్య ప్రపంచానికి చాటాలి. ప్రతిభ చూపితే ఉజ్వల భవిష్యత్‌కు దారులేర్పడుతాయి. విద్యార్థులు పోటీల్లో పాల్గొనేలా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ప్రోత్సహించాలి.

భరణి, జిల్లా సైన్స్ అధికారి, యాదాద్రి భువనగిరి జిల్లా

విద్యార్థుల్లో నూతన ఉత్సాహం



ఆటల పోటీలు విద్యార్థుల్లో నూతన ఉత్సాహాన్ని నింపనున్నాయి. పాఠశాల అంటే కేవలం తరగతి గదే కాదు మైదానం కూడా ఉంటుందని విద్యార్థులకు అవగతమవుతుంది. ఫలితంగా విద్యార్థుల్లో పోటీతత్వం పెరిగి క్రీడలతోపాటు చదువులోనూ ప్రతిభ చూపే అవకాశాలు పెరుగుతాయి. అన్ని స్థాయిల్లో ఎస్‌జీఎఫ్ టోర్నీలను విజయవంతంగా నిర్వహిస్తాం.

బాలకృష్ణ, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి, యాదాద్రి భువనగిరి జిల్లా

పోటీలు ఇలా..

కబడ్డీ, క్రికెట్, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, చెస్, టెన్నీస్, బాస్కెట్ బాల్, అథ్లెటిక్స్ తదితర పోటీలను అండర్-14, 17, 19 విభాగాల్లో పాఠశాల, ఇంటర్ బాల బాలికలకు వేర్వేరుగా నిర్వహిస్తారు. జూలై చివరి వారంలో మండల స్థాయి, ఆగస్టు మూడో వారంలో జిల్లా స్థాయి, సెప్టెంబరు చివరివారంలో రాష్ట్రస్థాయి, నవంబరులో జాతీయ స్థాయి పోటీలు జరగనున్నాయి.

బదిలీల భయం!

● ఆప్షన్ల కోసం అప్లికేషన్ల పంపిణీ ● మొదటి విడతలో 40శాతమే
● రేపటి వరకు ఆప్షన్‌కు గడువు ● 29వరకు అందనున్న బదిలీల ఉత్తర్వులు



భువనగిరి అర్బన్, జూలై 13: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామివారి ఆలయంలో బదిలీలకు రంగం సిద్ధమైనట్లు తెలుస్తోంది. కొండపై నలుగురు ఉద్యోగులు గుమిగూడినా ఇదే విషయంపై తర్జన.. భర్జన చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు బదిలీలు చేపట్టగా.., ఇందులో భాగంగా దేవదాయ, ధర్మదాయ శాఖకు కూడా బదిలీల ప్రక్రియ వర్తించింది. ఇందుకోసం ఉద్యోగులకు ఆప్షన్ అప్లికేషన్లు ప్రధాన కార్యాలయంలో అందుబాటులో ఉన్నాయి. ఆర్‌జేసీ పరిధిలో వేములవాడ, యాదగిరిగుట్ట, భద్రాచలం, డీసీ పరిధిలో కొమురవెల్లి, బాసర, కొండగట్టు ఆలయాల్లో ఏ ఆలయానికి బదిలీ చేసేదీ దేవాదాయ శాఖకు పరిధిలో ఉంది. తొలుత సూపరింటెండెంట్, సీనియర్, జూనియర్, రికార్డు అసిస్టెంట్లకు బదిలీల వేటుపడుతున్నట్లు ఇక్కడ అందరూ భావించారు. కానీ... ఏఈవో, ఆలయ పూజారులకు సైతం బదిలీలు తప్పవని తేలడంతో కొండపైన ఉద్యోగుల్లో భయాందోళన మొదలైంది. ఆలయంలో 278 మంది విధులు నిర్వహిస్తుండగా మినిస్టీరియల్ సిబ్బంది 91మంది, మతపరమైన సిబ్బంది 98మంది, నాలుగో తరగతి ఉద్యోగులు 89మంది అదేహోదా కలిగిన ఆలయానికి బదిలీ కానున్నారు. ప్రభుత్వం ఆప్షన్ల అవకాశం కల్పించగా మతపరమైన సిబ్బందికి బదిలీలు తప్పకపోవడంతో పూజారుల్లో ఆందోళన నెలకొంది. అయితే మొదటి విడతలో అన్ని విభాగాలకు సంబంధించిన అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది 40శాతం మాత్రమే బదిలీ కానున్నట్లు తెలిసింది. ఆప్షన్ అప్లికేషన్లు దాదాపు పూర్తికాగా, మిగిలిన వారికోసం ఈ నెల 15వరకు గడువు ఉండగా, 29 వరకు బదిలీల ఉత్తర్వులు అందనున్నాయి. బదిలీల నుంచి మినహాయింపు ఎవరికైనా ఉందా..? అనే ప్రశ్న తలెత్తుతోంది. పదవీ విరమణకు కాలపరిమితి తక్కువ, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్థులకు మినహాయింపు ఉండగా, ఇదివరకు బదిలీలపై వెళ్లిన వారికి కూడా ఉండొచ్చని భావిస్తున్నారు.

పట్నానికి పైరవీలు

ప్రభుత్వ పెద్దల సహకారంతో బదిలీల ప్రక్రియ నిలిపేందుకు విశ్వప్రయత్నాలు మొదలుపెట్టినట్లు తెలుస్తోంది. ఒకవేళ తప్పనిసరి పరిస్థితుల్లో హైదరాబాద్‌లోని భాగ్యలక్ష్మీ ఆలయం, కర్మన్‌ఘట్ ఆంజనేయస్వామి ఆలయానికి అధికారులు పైరవీలు చేస్తున్నట్లు సమాచారం. 2023 నవంబరు 3 నుంచి డిసెంబరు 5వరకు అసెంబ్లీ ఎన్నికల కోడ్, 2024 మేలో ఎంపీ ఎన్నికలు, ఎమ్మెల్సీ ఉపఎన్నికలకు సంబంధించి ఎన్నికల కమిషన్ మార్చి 16 నుంచి జూన్ 6వ తేదీ వరకు ఎన్నికల కోడ్ విధించగా అప్పట్లో బదిలీల ప్రక్రియ నిలిచిపోయింది. ఇదిలా ఉండగా సుమారు 13 ఏళ్లుగా ఇక్కడ బదిలీలు లేకపోవడంతో కొంతమంది అధికారులు పదోన్నతులతో ఉన్నతాధికారులయ్యారు. 1993 నుంచి వర్కర్లుగా విధుల్లో చేరి ఇప్పుడు ఉన్నతస్థాయిలో కొంతమంది అధికారులుగా ఉండగా, మరికొంతమంది కారుణ్య నియామకంలో వివిధ హోదాల్లో ఎంపికైన వారున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో 2011-12 మధ్యకాలంలో భద్రాచలం, బాసర, కొండగట్టు, వేములవాడ దేవాలయాలకు ఇక్కడి నుంచి బదిలీపై వెళ్లగా, అప్పటి నుంచి తిరిగి బదిలీలు చేపట్టలేదు. దేవాదాయ ధర్మదాయ శాఖ బదిలీల అంశంపై బ్యాన్ విధించగా ఇప్పుడు ఎత్తేశారు. ఇది వరకైతే జీవో 888 ద్వారా కోర్టును ఆశ్రయించి బదిలీలపై స్టే పొందే అవకాశం ఉండగా ఇప్పుడు ఆ పరిస్థితి లేదు.

కళాశాలలో ఫర్నీచర్ కొరత

● నేలపైనే కూర్చుంటున్న అధ్యాపకులు
● ఖాళీగా అధ్యాపక పోస్టులు
● ఏడాదైనా మంజూరు కాని భవనం
● ఇదీ నార్కట్‌పల్లి కళాశాల దుస్థితి

నార్కట్‌పల్లి, జూలై 13: సాధారణంగా ఏ పాఠశాలలోనైనా.... కళాశాలలో నైనా విద్యార్థులు నేలపైన, టీచర్లు, అధ్యాపకులు కుర్చీలపైన కూర్చుంటారు. కానీ నార్కట్‌పల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీ (కో-ఎడ్యుకేషన్)లో మాత్రం (అతిథి) అధ్యాపకుల పరిస్థితి చూస్తే జాలేస్తోంది. సాధారణంగా తరగతి గదుల్లో పాఠాలు బోధించిన అనంతరం ఉపాధ్యాయులైనా, అధ్యాపకులైనా స్టాఫ్ రూంలోకి వచ్చి కుర్చీలో కూర్చుంటారు. కొంత వ్యవధి తీసుకున్న తర్వాత మరో తరగతిలో పాఠాలు చెప్పేందుకు పుస్తకాలను వల్లె వేస్తారు. కానీ నార్కట్‌పల్లి ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఫర్నీచర్ కొరతతో అధ్యాపకులు నేలపై చాప వేసుకుని కూర్చోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. అదేవిధంగా కాలేజీకి విద్యార్థుల అడ్మిషన్లు పెరుగుతున్నా అధ్యాపకుల పోస్టులు ఖాళీగానే ఉన్నాయి. ఇక ఒకేషనల్ సంగతి సరేసరి ఒక్క పోస్టు కూడా మంజూరవ్వక పోవడంతో కాలేజీ ప్రిన్సిపాల్ తన జేబు నుంచే వారికి గౌరవ వేతనం చెల్లిస్తున్నారు.

గత ఏడాదే ప్రారంభం

నార్కట్‌పల్లిలో ప్రభుత్వ జూనియర్ కాలేజీని (2023-24 విద్యా సంవత్సరం) బీఆర్ఎస్ హయాంలో గతేడాది ప్రారంభించారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ కోర్సులతో పాటు వృత్తి విద్యా కోర్సులు బోధించేలా కాలేజీని ఏర్పాటు చేశారు. పూర్వం ఏఎంఆర్ కాలేజీగా కొనసాగిన భవనంలోనే ఈ ప్రభుత్వ జూనియర్ కాలేజీని అద్దెకు తీసుకుని నిర్వహిస్తున్నారు. ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరానికి కలిపి మొత్తం 400 మంది విద్యార్థులకు అడ్మిషన్ ఇచ్చేలా కాలేజీకి అనుమతి ఉంది. అదే విధంగా ఎంపీహెచ్‌డబ్ల్యూ, ఎంఎల్‌టీలతో పాటు ఈ ఏడాది నుంచి ఈటీ, డీటీ (ఎలక్ట్రికల్ టెక్నాలజీ, డెయిరీ టెక్నాలజీ) కోర్సులను కూడా ప్రవేశపెట్టారు.



నార్కట్‌పల్లి ప్రభుత్వ జూనియర్ కాలేజీ (అద్దె) భవనం

అధ్యాపకుల కొరత

కాలేజీని మంజూరు చేసిన ప్రభుత్వం అందుకు సరిపడా లెక్చరర్ల పోస్టులను భర్తీ చేయలేదు. దీంతో జనరల్ కోర్సుల బోధనకు 15 మంది అవసరం ఉండగా కేవలం 9 మంది (అదీ అతిథి లెక్చరర్లు) ఉన్నారు. ఇంకా ఆరుగురు జీఎల్‌ల అవసరం ఉంది. ఇకపోతే ఒకేషనల్ కోర్సుల అభ్యాసానికి విద్యార్థుల నుంచి స్పందన వస్తుంది. మొదటి సంవత్సరంలో 52 మంది అడ్మిషన్ తీసుకోగా ఈ విద్యా సంవత్సరానికి మరో 60 మంది అడ్మిషన్ పొందారు. కానీ ప్రభుత్వం మాత్రం ఒకేషనల్ కోర్సులు బోధించే (4 పోస్టుల) అధ్యాపకులను మంజూరు చేయలేదు.

ప్రిన్సిపాల్ జేబు నుంచే వేతనం

ఒకేషనల్ కోర్సులను మంజూరు చేసిన ప్రభుత్వం బోధన పోస్టులను మంజూరు చేయలేదు. దీంతో కాలేజీ ప్రిన్సిపల్ మహ్మద్ ఇస్మాయిల్ తన సొంత డబ్బునే ఐదుగురు అధ్యాపకులకు సీనియారిటీ ప్రాతిపదికన గతేడాది నుంచి వేతనం చెల్లిస్తున్నారు. అదే విధంగా కాలేజీకి స్కావెంజర్, స్వీపర్ పోస్టులు కూడా మంజూరు చేయలేదు. దీంతో స్వీపర్, స్కావెంజర్లకు కూడా ఆయనే డబ్బులు చెల్లిస్తున్నారు. ఇప్పటికే సుమారు రూ. 2 లక్షల వరకు ఖర్చు చేశారు.

ఫర్నీచర్ లేక నేలపై అధ్యాపకులు

వాస్తవానికి కొత్తగా మంజూరయ్యే కాలేజీకి ప్రభుత్వం ఫర్నీచర్‌ను కూడా మంజూరు చేయాల్సి ఉంది. డబుల్ డెస్క్, స్టాఫ్ చైర్స్, టేబుళ్లు, క్రీడా సామగ్రి, కంప్యూటర్లు, ల్యాబ్ పరికరాలు మంజూరు చేయాల్సి ఉంది. కానీ కేవలం ప్రభుత్వ కాలేజీ మంజూరవడంతోనే సరిపెట్టుకోవాల్సిన పరిస్థితి. స్టాఫ్‌రూంలో ఫర్నీచర్ లేక అధ్యాపకులు నేలమీద చాపపైనే కూర్చుంటున్న తీరు విచారకరం. కళాశాలకు కొత్త ఫర్నీచర్ రాకపోవడంతో ఈ భవనంలో ఇంతకుముందు నిర్వహించిన ప్రైవేట్ కాలేజీ యాజమాన్యానికి చెందిన బెంచీలు, కుర్చీలను తాత్కాలికంగా వినియోగిస్తున్నారు.



కాలేజీ స్టాఫ్ రూంలో నేలపై కూర్చున్న అధ్యాపకులు

రద్దయిన హాస్టల్ వసతి

గత విద్యా సంవత్సరంలో స్థానిక బీసీ ప్రత్యేక హాస్టల్‌లో కాలేజీ విద్యార్థులకు కూడా భోజన, నివాస వసతి కల్పించారు. కానీ పరిపాలన పరంగా, సాంకేతికంగా ప్రీ మెట్రిక్ హాస్టల్‌గా గుర్తించిన ఈ వసతిగృహంలో పోస్టుమెట్రిక్ కింద కాలేజీ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందడం లేదు. దీంతో కొంతమంది బాలికలు నల్లగొండలోని ప్రభుత్వ మహిళా బాలికల వసతిగృహంలో ఉంటూ రాకపోకలు సాగిస్తున్నట్లు కాలేజీ అధ్యాపకులు తెలిపారు. గతేడాది మాదిరిగానే బీసీ ప్రత్యేక హాస్టల్‌ను పోస్టుమెట్రిక్‌గా గుర్తించి హాస్టల్ వసతి పునరుద్ధరించాల్సిన అవసరం ఉంది.

బీఐఈవో కమిషనర్‌కు లేఖలు రాశా



నార్కట్‌పల్లి ప్రభుత్వ జూనియర్ కాలేజీలో అధ్యాపక పోస్టుల భర్తీతో పాటు కనీస వసతుల కల్పన కోసం లేఖలు రాసి అందజేశా. వీటితో పాటు కాలేజీ నిర్వహణలో భాగమైన ఫర్నీచర్ కోరుతూ కూడా బీఐఈవో కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించా. ప్రతీ విద్యార్థికి రూ.25లు చొప్పున ఇచ్చే గ్రాంటు కూడా రాలేదు. కాలేజీలో వందశాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేస్తున్నాం. స్థానిక ప్రజాప్రతినిధులు చొరవ చూపి జూనియర్ కాలేజీని నిలబెట్టుకోవాలి. పక్కా భవనాల నిర్మాణం కోసం కనీసం 4 ఎకరాల భూమిని గుర్తించాలి. కనీస వసతుల కల్పన కోసం దాతలు ముందుకు రావాలి.

● మహ్మద్ ఇస్మాయిల్, ప్రిన్సిపాల్

కేసీఆర్‌కు రాజకీయ పుట్టగతులుండవు

● *టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి నన్నూరి నర్సిరెడ్డి*

చౌటుప్పల్ టౌన్, జూలై 13: టీడీపీని అనేక రకాలుగా ఇబ్బందులకు గురిచేసిన కేసీఆర్‌కు రాజకీయ పుట్టగతులు లేకుండా పోవడం ఖాయమని టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి నన్నూరి నర్సిరెడ్డి అన్నారు. చౌటుప్పల్ పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో శనివారం పార్టీ నూతన గ్రామ శాఖల అధ్యక్షులతో నర్సిరెడ్డి ప్రమాణ స్వీకారం చేయించి నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా నర్సిరెడ్డి మాట్లాడుతూ టీడీపీని భూస్థాపితం చేయాలని కేసీఆర్ రకరకాల కుట్రలు చేశారని, చివరకు బీఆర్ఎస్సే భూస్థాపితం అయ్యే పరిస్థితి నెలకొందన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో టీడీపీ కార్యకర్తలపై అనేక అక్రమ కేసులు బనాయించి వేధింపులకు గురిచేశారని, నియంతగా వ్యవహరించిన కేసీఆర్‌ను ప్రజలు ఇంటికి పంపించారన్నారు. బీఆర్ఎస్ పరిస్థితి పూర్తిగా దిగజారి పోయిందని, కేసీఆర్ ఆత్మరక్షణలో పడి కొట్టుమిట్టాడుతున్నారన్నారు. టీడీపీ కార్యకర్తలకు శిక్షణా తరగతులను నిర్వహించి రాజకీయ విషయాలపై అవగాహన కల్పించేందుకు ప్రణాళికను రూపొందిస్తున్నామని, టీడీపీపై ఉన్న ప్రజల అభిమానాన్ని ఎవరూ కొల్లగొట్టలేరన్నారు. భువనగిరి పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు కే.కృష్ణాచారి మాట్లాడుతూ స్థానికసంస్థల ఎన్నికల్లో సత్తా చాటేందుకు ఇప్పటినుంచే సిద్ధంకావాలని, టీడీపీలో చేరేందుకు వచ్చే వారిని స్వాగతించాలన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రాపోలు నర్సింహ మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాలకు టీడీపీ అండగా ఉంటుందని, ఈ వర్గాలకు టీడీపీ హయాంలో ఎంతో మేలు జరిగిందన్నారు. అంతకు ముందు పార్టీ కార్యాలయంపై టీడీపీ జెండాను నన్నూరి నర్సిరెడ్డి ఎగురవేశారు. సమావేశంలో టీడీపీ మునుగోడు ఇన్‌చార్జి బడుగు లక్ష్మయ్య, మండల ప్రధాన కార్యదర్శి వర్కాల వెంకటేశం, పట్టణ అధ్యక్షుడు సుంకరి జంగయ్య, ప్రధాన కార్యదర్శి సిల్వేరు రాజు, నాయకులు నల్ల పర్వతాలు, ఎడ్ల రాంరెడ్డి, పాశం రఘుపతి, యాట వెంకటేశం, తడక కోటేశ్వర్, జి.కృష్ణతేజ, గోవిందాచారి, డిల్లీ కళమ్మ, బి.మల్లారెడ్డి, జి.అంజిరెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నర్సిరెడ్డి, నియామకపత్రం అందుకుంటున్న సిల్వేరు రాజు

గుండెపోటుతో గుండాల మాజీ ఎంపీపీ మృతి



నివాళి అర్పిస్తున్న ప్రభుత్వ విప్ అయిలయ్య



అమరావతి(ఫైల్)


గుండాల, జూలై 13: గుండాల మండల తాజా మాజీ ఎంపీపీ తాండ్ర అమరావతి(28) శనివారం ఉదయం గుండెపోటుతో మృతి చెందారు. ఉన్నత విద్యావంతురాలైన అమరావతి ఐదేళ్ల క్రితం బీఆర్ఎస్ పార్టీ నుంచి ఎంపీటీసీగా గెలుపొంది గుండాల ఎంపీపీగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వివాహం కాకముందే ఎంబీఏ పూర్తి చేసుకున్నారు. ఆమె భర్త శోభన్ ఎంఎస్సీ, బీఈడీ పూర్తిచేసి మండల కేంద్రంలోని ఎంఆర్‌సీలో సీఆర్‌పీగా పనిచేస్తున్నారు. వివాహం అయిన అనంతరం భర్త కుటుంబం రాజకీయ నేపథ్యం కారణంగా ఆమె రాజకీయ అరంగేట్రం చేశారు. రిజర్వేషన్ కలిసిరావడంతో మరిపడగ నుంచి 2019లో బీఆర్ఎస్ పార్టీ తరఫున పోటీచేసి గెలుపొందారు. అనంతరం అప్పటి ఎమ్మెల్యే గొంగిడి సునీత మహేందర్‌రెడ్డి సహకారంతో ఎంపీపీగా పదవి బాధ్యతలు చేపట్టారు. ఇటీవల పదవీ కాలం ముగిసిన విషయం తెలిసిందే. ఇదిలా ఉంటే శనివారం రోజూ మాదిరిగానే తెల్లవారుజామున నిద్రలేచి బాత్‌రూమ్‌కు వెళ్లింది. చాలా సేపటి వరకు తిరిగి రాకపోవడంతో భర్త వెళ్లి చూసే సరికి స్పృహ తప్పి పడిపోయి కన్పించింది. వెంటనే ప్రథమ చికిత్స కోసం గ్రామంలోని ఆర్ఎంపీ వైద్యుడిని సంప్రదించారు. జనగాంకు వెళ్లాలని చెప్పడంతో 108లో తీసుకెళుతుండగా అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. కాగా అమరావతి దంపతులకు సంతానం కలగలేదు. అమరావతి మృతికి గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఆమె మృతి పట్ల ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య,భువనగిరి సివిల్ కోర్టు అసిస్టెంట్ గవర్నమెంట్ లీడర్ ఎం.ఎ.రహీం, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు అండెం సంజీవరెడ్డి, మాజీ డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు గొంగిడి సునీత, బూడిద భిక్షమయ్య గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఈరసరపు యాదగిరి గౌడ్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు సూదగాని హరిశంకర్‌గౌడ్, ఎండి.ఖలీల్, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ పాండరి నివాళులర్పించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

ఐరాల(కాణిపాకం), జూలై 13: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని చిత్తూరు జిల్లా కాణిపాకం పోలీసుస్టేషన్ పరిధిలోని చిగరపల్లె హైవే వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఆరుగురు గాయపడినట్లు ఎస్ఐ రామ్‌మోహన్ తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు తెలంగాణ రాష్ట్రం సూర్యాపేటకు చెందిన ఉపేంద్రాచారి తన స్నేహితులు ఏడుగురితో కలసి సొంతవాహనంలో శుక్రవారం బయలుదేరి శనివారం తిరుపతి వచ్చారు. శ్రీవారి దర్శనానికి సమయం ఉండటంతో వీరు కాణిపాకం వరసిద్ధుడి దర్శనానికి బయలుదేరారు. వారు ప్రయాణిస్తున్న వాహనం ముందు వెళుతున్న వాహనాన్ని ఢీకొనగా, వెనక నుంచి వచ్చిన లారీ వీరి వాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో ఉపేంద్రాచారి అక్కడికక్కడే మృతి చెందారు. మృతదేహాన్ని శవపంచనామా కోసం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కాగా తీవ్రంగా గాయపడిన కార్తీక్ అనే వ్యక్తిని చికిత్స నిమిత్తం సీఎంసీకి తరలించారు. ప్రమాదంలో స్వల్పంగా గాయపడిన సురేష్‌గౌడ్, మధుబాబు, ఒప్పలయ్య, మహేందర్, గంగాధర్‌లు చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వాహనాన్ని నడుపుతున్న మధుబాబుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టిన ట్రావెల్ బస్సు

వెనుక నుంచి వస్తున్న మరో మూడు వాహనాల ఢీ



డివైడర్‌ను ఢీకొట్టిన ట్రావెల్ బస్సు, దెబ్బతిన్న విద్యుత్ స్తంభం

భువనగిరి రూరల్, జూలై 13 : అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టిన ట్రావెల్ బస్సు వెనుక నుంచి వస్తున్న మరో మూడు వాహనాలు వరుసగా ఢీకొన్న సంఘటన యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి శివారులోని పగిడిపల్లి వద్ద శుక్రవారం రాత్రి జరిగింది. భువనగిరి రూరల్ ఎస్ఐ సంతోష్ కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జనగాం జిల్లా నుంచి హైదరాబాద్ వెళ్తున్న ఎస్‌కే అబ్దుల్ ట్రావెల్ బస్సు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. అదే సమయంలో బస్సు వెనుక నుంచి వస్తున్న కారు బ్రేక్ వేయడంతో వెనుక నుంచి వరుసగా వస్తున్న టాటాఏసీ వాహనం, ఆవులను తరలిస్తున్న లారీ ఒకదానికొకటి మూడు వరుసగా ఢీకొన్నాయన్నారు. ప్రమాదంలో భారీ స్ట్రీట్ లైట్ ధ్వంసమైన ఘటనలో బస్సు యజమానిపై జాతీయ రహదారుల ప్రాజెక్టు మేనేజర్ తేజోనిధి శనివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. అదేవిధంగా టాటాఏసీ వాహనాన్ని ఢీకొట్టిన 13 పాడిఆవులను తరలిస్తున్న లారీ యాజమానిపై కేసు నమోదు చేసి అందులోని 13పాడి ఆవులను జియాగూడ గోశాలకు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. ప్రమాదంలో భువనగిరి పట్టణానికి చెందిన కూరగాయల వ్యాపారి టాటాఏసీ వాహనం నడుపుతున్న దేశెట్టి వెంకటేశ్‌కు స్వల్ప గాయాలైనట్లు తెలిపారు. ట్రావెల్ బస్సులో ఎనిమిది మంది, కారులో నలుగురు వ్యక్తులు ప్రయాణిస్తున్నారని, ఎవరికి గాయాలు కాలేదన్నారు. ఘటనలో ట్రావెల్ బస్సు యజమాని ఎస్‌కే అబ్దుల్‌పై అదేవిధంగా టాటాఏసీ వాహనాన్ని ఢీకొట్టిన తమిళనాడుకు చెందిన లారీ డ్రైవర్ కందస్వామిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రేషన్ బియ్యం వ్యాపారుల అరెస్ట్

మిర్యాలగూడ, జూలై 13 : రేషన్ బియ్యాన్ని వినియోగదారుల నుంచి కొనుగోలు చేసి విక్రయిస్తున్న వ్యాపారులను అరెస్ట్ చేసినట్లు నల్లగొండ జిల్లా మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్‌రాజు తెలిపారు. శనివారం తన కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 5న 22 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని లారీలో హుజూర్‌నగర్ నుంచి వాడపల్లి మీదుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి అక్రమంగా తరలిస్తుండగా వాడపల్లి పోలీసులు పట్టుకున్నారని తెలిపారు. కాగా ఆ కేసులో బియ్యం వ్యాపారులు దాచేపల్లికి చెందిన కల్లూరి లింగయ్య, జోగుపర్తి ముక్కటేశ్వరరావు అలియాస్ ముక్కంటిలను ఎస్ఐ రవి అరెస్ట్ చేసినట్లు తెలిపారు. నిందితులను పట్టుకున్న ఎస్ఐను డీఎస్పీ అభినందించారు.

వీధి కుక్కల దాడిలో గాయాలు



గాయపడిన బాలుడు

చండూరు, జూలై 13 : నల్లగొండ జిల్లా చండూరు మునిసిపాలిటీలో వీధి కుక్కలు వీరంగం సృష్టిస్తున్నాయి.గుంపులు, గుంపులుగా తిరుగుతూ పట్టణ వాసులపై దాడి చేస్తున్నాయి. పట్టణంలోని ఏడో వార్డులో శనివారం వీధికుక్కలు ఇద్దరు వ్యక్తులపై దాడి చేసి గాయపరిచాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం కంభంపాటి ఆంజనేయులుకు కాలుకు, ఐదేళ్ల బాలుడిపై దాడికి దిగడంతో మెడపై తీవ్ర గాయాలయ్యాయి. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందినట్లు బాధిత కుటుంబసభ్యులు తెలిపారు. దాడి చేసిన సమయంలో స్థానికులు గమనించి కుక్కలను తరిమేయడంతో పెను ప్రమాదం తప్పిందన్నారు. పట్టణంలో కొన్నినెలల క్రితం ఓ వృద్ధురాలితో పాటు ఎనిమిది మందిపై దాడి చేసి తీవ్రంగా గాయపర్చాయన్నారు. వీధికుక్కలు స్వైరవిహారం చేస్తుండడంతో ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకుని భయంతో ఉండాల్సి పరిస్థితులు నెలకొన్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కుక్కల బెడద అధికంగా ఉందని అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

కారులో వచ్చి మేకల అపహరణ

నార్కట్‌పల్లి, జూలై 13: పాకలో కట్టేసిన ఆరు మేకలను గుర్తుతెలియని వ్యక్తులు కారులో వచ్చి అపహరించుకుపోయారు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలకేంద్రంలో శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలో తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా పల్ల వెంకటయ్య అనే వ్యక్తి ఇల్లు ఉంది. తనకున్న మేకలను ఇంటి ముందున్న పాకలో రోజుమాదిరిగానే ఉంచాడు. శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత గుర్తుతెలియని వ్యక్తులు కారులో వచ్చి అపహరించుకుపోయారు. తన సోదరుడి ఇంటి ముందున్న సీసీ ఫుటేజీలో చోరీ ఘటన అస్పష్టంగా రికార్డయ్యింది. కాగా చోరీకి గురైన మేకల విలువ సుమారు రూ.70,000లు ఉంటుందని బాధితుడు తెలిపాడు. సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపారు.

పెండింగ్ డీఏలను వెంటనే విడుదల చేయాలి


విద్యార్థులను సన్మానిస్తున్న సంఘం నాయకులు

నల్లగొండ కల్చరల్, జూలై 13: పెన్షనర్లు, ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న డీఏలను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా కార్యదర్శి జెల్లా శ్రీశైలం, సంఘం నల్లగొండ జిల్లా అధ్యక్షుడు గజవెల్లి సత్యం డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని పెన్షనర్స్ భవనంలో శనివారం జరిగిన సంఘ సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే పెన్షనర్ల పెండింగ్ డీఏలను ఇస్తామని హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చి ఏనిమిది నెలలు కావస్తున్నా ఇంత వరకు ఇవ్వక పోవడం అన్యాయమన్నారు. పెన్షనర్లకు సంబంధించిన ఈహెచ్ఎస్, పీఆర్సీ సమస్యలను పరిష్కరించాలని కోరారు. అనంతరం పదో తరగతిలో 9.5 జీపీ సాధించిన పది మంది విద్యార్థులకు నగదు పురస్కారం అందించి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి గోవింద్ సుధాకర్, నాయకులు ఆంజనేయులు, రంగయ్య, శేషారెడ్డి, జిల్లా పుల్లయ్య, కేశవాచారి, రమేష్, మహేశ్వర్, రవి ప్రసాద్‌రావు, ఆజం పాల్గొన్నారు.

కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలి

చిట్యాలరూరల్, జూలై 13: వ్యవసాయాన్ని నమ్ముకుని జీవనాన్ని కొనసాగిస్తున్న కౌలు రైతులకు అన్యాయం జరగకుండా ప్రభుత్వం గుర్తింపుకార్డులు ఇవ్వాలని రైతుసంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఐతరాజు నర్సింహ డిమాండ్ చేశారు. చిట్యాల మండలం ఆరెగూడెంలో రైతుసమస్యలపై శనివారం రైతుసంఘం ఆధ్వర్యంలో సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా కౌలు రైతుల సమస్యలను నమోదు చేసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కౌలు రైతులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఎన్నేళ్లయినా వారి సమస్యలకు పరిష్కారం లభించకపోవడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యుడు అరూరి శ్రీను, మండల అధ్యక్షుడు లడె రాములు, నాయకులు సుర్కంటి బుచ్చిరెడ్డి, లడే శ్రీను, అంజయ్య, శివయ్య, లింగయ్య, పద్మ పాల్గొన్నారు.

నార్కట్‌పల్లి డిపోకు పూర్వ వైభవం తీసుకురావాలి

నార్కట్‌పల్లి, జూలై 13: ఎంతో చారిత్రక నేపథ్యం కలిగిన నార్కట్‌పల్లి ఆర్టీసీ డిపోకు పూర్వవైభవం తీసుకురావాలని మంత్రి పొన్నం ప్రభాకర్‌కు మాజీ జడ్పీటీసీ దూదిమెట్ల సత్తయ్య వినతిపత్రం అందజేశారు. నల్లగొండకు మంత్రి వెంకట్‌రెడ్డితో వెళ్తున్న ఆయన శనివారం నార్కట్‌పల్లి వద్ద ఆగారు. ఆయనకు స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి వినతిపత్రం అందజేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో డిపోను పూర్తిగా నిర్వీర్యం చేశారని, ఈ డిపో బస్సులను వేరే డిపోలకు బదిలీ చేశారని పేర్కొన్నారు. నార్కట్‌పల్లి డిపోకు బస్సులు, సిబ్బందిని కేటాయించి పూర్వవైభవం తేవాలని వినతిపత్రంలో కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బత్తుల ఊశయ్య, నాయకులు వడ్డే భూపాల్‌రెడ్డి, పల్లె నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ తరగతులను విజయవంతం చేయాలి

దేవరకొండ, జూలై 13: నకిరేకల్‌లో ఈనెల 13, 14, 15 తేదీల్లో జరగనున్న ఎస్ఎఫ్ఐ జిల్లాస్థాయి విద్య వైజ్ఞానిక శిక్షణ తరగతులను విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ దేవరకొండ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు రమావత్ లక్ష్మణ్, బూడిద వెంకటేష్ కోరారు. దేవరకొండలో శనివారం నకిరేకల్‌లో జరగనున్న శిక్షణ తరగతులకు వారు బయలుదేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలపై ఎస్ఎఫ్ఐ నిరంతరం పోరాటాలు నిర్వహిస్తుందన్నారు. నకిరేకల్‌లో జరుగనున్న విద్య, వైజ్ఞానిక శిక్షణ తరగతులకు 200 మంది ప్రతినిధులు హాజరుకానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ దేవరకొండ, కొండమల్లేపల్లి, పీఏపల్లి మండలాల కార్యదర్శులు రాహుల్, చరణ్, దేవేందర్, రాకేష్, శ్రీకాంత్, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల వలయంలో 'ఆదర్శ' పాఠశాల

- వసతిగృహంలో నీటి కొరతతో స్నానానికి ఇక్కట్లు
- 15 రోజులుగా నీటి సరఫరా లేక అవస్థలు
- ఇబ్బందులు పడుతున్న బాలికలు
- నిర్వహణ లేక అధ్వానంగా మరుగుదొడ్లు
- వంట గది లేక ఆరుబయటే వంటావార్పు


ఆరుబయటనే భోజనం చేస్తున్న విద్యార్థినులు

కేతేపల్లి, జూలై 13: మండలంలోని కొర్లపహాడ్ గ్రామంలో గల తెలంగాణ ఆదర్శ పాఠశాల సమస్యల నిలయంగా మారింది. 500 మంది విద్యార్థులు గల పాఠశాల, వంద మంది ఇంటర్ విద్యార్థినులతో పాఠశాలకు అనుబంధంగా ఉన్న వసతిగృహం నిండా సమస్యలే ఉన్నాయి. పాఠశాల, వసతిగృహంలో నెలకొన్న సమస్యలతో పాఠశాల విద్యార్థినులు నిత్యం సతమతమవుతున్నారు. పాఠశాలకు తాగునీటిని అందించే ఆర్వో ప్లాంటుకు ట్యాంకర్‌ను అనుసంధానించే ప్లాస్టిక్ పైపులు సైతం పాఠశాల యాజమాన్యం సమకూర్చలేక పోతుంది. దీంతో ఆర్వో ప్లాంటు నీటిని ఓ పెద్ద గిన్నెలో పట్టుకుని జగ్గుతో విద్యార్థులు తాగుతున్నారు. పాఠశాల ఆవరణలో బోరు పడకపోవడంతో పాఠశాలకు దూరంగా గుడివాడ రోడ్డు వెంట వేసిన బోరు నుంచి ఈ పాఠశాలకు నీటి సరఫరా జరుగుతుంది. తాగునీటికి మిషన్ భగీరథ నీటిని అందిస్తున్నారు. ఈ నేపథ్యంలో పాఠశాలకు నీటిని అందించే బోరు మరమ్మతులకు రావడం, పైప్‌లైన్ దెబ్బతినడంతో 15 రోజుల నుంచి నీటి సరఫరా నిలిచిపోయింది. వీటికి మరమ్మతులు చేసే వారే లేకపోవడంతో రోజుల తరబడి నీటి సమస్య కొనసాగుతుంది. దీంతో పాఠశాల యాజమాన్యం వారం రోజులుగా గ్రామ పంచాయతీ వాటర్ ట్యాంకర్ తెప్పించి సమీపంలోని మిషన్ భగీరథ ట్యాంకు నుంచి నీటిని దాంట్లో నింపి విద్యార్థులకు అందుబాటులో ఉంచింది. అయితే ఈ ట్యాంకర్ మురికినీటిలో నిలపడంతో విద్యార్థులంతా మధ్యాహ్న భోజనాలకు మురికి గుంట వద్దే చేతుల కడగాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. మధ్యాహ్న భోజన వంటలు చేయడానికి అవసరమైన షెడ్డు లేకపోవడంతో వంట ఏజెన్సీ మహిళలు ఎండకు, వానకు ఆరుబయటే వంటలు చేసి పెడుతున్నారు. వంటలపై పాఠశాల నిర్వాహకుల ఆజమాయిషీ లేకపోవడంతో భోజనం నాణ్యతగా ఉండడం లేదు. ఉడికీ ఉడకని అన్నం, నీళ్ల కూర, నీళ్ల చారుతో కూడిన భోజనం తినలేక కొందరు విద్యార్థినులు పడవేస్తుండగా మరికొందరు ఇంటి నుంచి బాక్సుల్లో తెచ్చుకుని తింటున్నారు. వసతిగృహంలోనూ నీటి కొరతతో విద్యార్థినులు మరుగుదొడ్ల వినియోగం, స్నానాలకు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారు. చెరుకుపల్లి గ్రామంలోని కస్తూర్బా పాఠశాల ప్రిన్సిపాల్‌కు ఇక్కడి వసతిగృహ వార్డెన్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. దీంతో వార్డెన్ పూర్తిస్థాయిలో ఆదర్శ పాఠశాల వసతిగృహం విద్యార్థుల సమస్యలపై దృష్టి కేంద్రీకరించడం లేదని తెలుస్తోంది.


ట్యాంకర్ నీటితో మురుగు నీటి గుంట పక్కనే చేతులు కడుగుతున్న బాలికలు

15 రోజులుగా నీరు రావడం లేదు

పాఠశాలకు 15 రోజులుగా నీటి సరఫ రాలేదు. నీళ్లు లేకపోవడంతో మల, మూత్ర విసర్జనకు ఆరు బయటకు వెళ్తున్నాం. తాగునీటి కోసం ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంటుకు మధ్య పైప్‌లైన్ పాడవడంతో మంచినీరు గిన్నెలో పట్టుకుని జగ్గుతో తాగుతున్నాం.

జి.అరవింద్, 8వ తరగతి

మరుగుదొడ్లు శుభ్రం చేసే వారు లేరు

పాఠశాలలో మరుగుదొడ్లు అధ్వానంగా ఉన్నాయి. మరుగుదొడ్లకు 15 రోజులుగా నీటి సరఫరా లేదు. నీళ్లు ఉన్నా అవి వినియోగించేలా లేవు. తాగునీటికి సైతం అవస్థలు ఎదుర్కొంటున్నాం. నీటి సరఫరా లేకపోవడంతో పాఠశాల బాలికలంతా తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం.

శివాని, 9వ తరగతి

ప్రజావాణిలో ఫిర్యాదు చేశాం

పాఠశాలకు నీటిని అందించే బోరు, పైప్‌లైన్ పాడవడంతో నీటి సరఫరా జరగడం లేదు. పాఠశాలలో నెలకొన్న నీటి సమస్యపై ఇటీవల ప్రజావాణిలో ఫిర్యాదు చేశాం. వారం రోజుల్లో పరిష్కరిస్తామని అధికారులు తెలిపారు. మిషన్ భగీరథ నీటిని నిల్వ చేయడానికి పాఠశాల ఆవరణలోనే సంపు నిర్మించే ఏర్పాట్లు జరుగుతున్నాయి. నాలుగైదు రోజుల్లో సమస్య పరిష్కారమవుతుంది.

సబితారెడ్డి, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్

జర్నలిస్టుల సంక్షేమానికి కృషి : బాలునాయక్


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలునాయక్

చింతపల్లి, జూలై 13: జర్నలిస్టుల సంక్షేమానికి తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. మండలకేంద్రంలో శనివారం ప్రెస్‌క్లబ్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలతో పాటు ఇందిరమ్మ పథకంలో మంజూరైన ఇళ్లు అందించేందుకు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి డిండి, ఎత్తిపోతల ప్రాజెక్టు పనులు త్వరితగతిన పూర్తి చేయడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం జర్నలిస్టులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో తెలంగాణ జర్నలిస్టు ఫోరం అధ్యక్షుడు పల్లె రవికుమార్, ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు పుప్పాల వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడు జెల్లా నరసింహగౌడ్, ప్రధాన కార్యదర్శి పసునూరి వెంకటేష్, కోశాధికారి ప్రవీణ్, గౌరవ అధ్యక్షుడు వనమాల వెంకటేష్, కార్యవర్గ సభ్యులు, మాజీ ఎంపీపీ కొండూరి భవానీపవన్‌కుమార్, మాజీ వైస్ ఎంపీపీ యాచారం యాదయ్యగౌడ్, పార్టీ మండల అధ్యక్షుడు అంగిరేకుల నాగభూషణ్, నాయకులు దొంతం సంజీవరెడ్డి, యాదగిరి, వెంకటయ్య గౌడ్, గోవర్ధన్, భాస్కర్, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

తిరుమలగిరి(సాగర్), జూలై 13: వర్షాకాలంలో వ్యాధులు దరిచేరకుండా ఉండాలంటే ప్రతి ఒక్కరూ తమ ఇంటితో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పీహెచ్‌సీ డాక్టర్ రతన్ స్టెఫీ అన్నారు. మండలంలోని నాయకునితండాలో శనివారం సీజనల్ వ్యాధులపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఇంట్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని సూచించారు. గర్భిణులు ప్రభుత్వ ఆస్పత్రులకు వెళ్లాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో అన్ని సౌకర్యాలు ఉన్నందున ప్రసవం అక్కడే చేయించుకొని డబ్బులు ఆదా చేసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో మెరావత్ మునినాయక్, ఏఎన్ఎం సీహెచ్. ప్రమీల, ఆశా వర్కర్ విజయ, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి


వైద్యశిబిరంలో మాట్లాడుతున్న జాల నర్సింహారెడ్డి

చందంపేట, జూలై 13: వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని పీఏసీఎస్ చైర్మన్ జాల నర్సింహారెడ్డి అన్నారు. చందంపేట మండలం చిత్రియాలలో హైదరాబాద్ యశోద ఆసుపత్రి వైద్య బృందం జాల నర్సింహారెడ్డి తల్లిదండ్రుల జ్ఞాపకార్థం మెగా వైద్యశిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. తమ తల్లిదండ్రులు గతంలో చేసిన వైద్యసేవలకు గుర్తింపునకు వారి జ్ఞాపకార్థం వైద్యశిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వైద్యశిబిరంలో మండల వ్యాప్తంగా వచ్చిన వారికి బీపీ, షుగర్, గుండె, కంటి, ఆర్థోపెడిక్ వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం వారికి వెంకట్‌రెడ్డి అండాలమ్మ ట్రస్టు నిర్వాహకులు ఉచితంగా మందులు అందజేశారు. ఉన్న ఊరికి సేవ చేయడంలో ఎంతో సంతృప్తినిస్తుందని, రాజకీయంలో ఏ స్థానంలో ఉన్న చిత్రియాల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని జాల నర్సింహారెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు నిర్వాహకులు జాల తిలక్‌రెడ్డి, అంకులయ్య, తిరుపతయ్య, అంజనేయులు, గ్రామస్థులు, లయన్స్‌క్లబ్ సభ్యులు, వైద్యులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో జగన్నాథ రథయాత్ర

- ఉట్టిపడిన ఆధ్యాత్మికత
- పాల్గొన్న ఎమ్మెల్సీ కోటిరెడ్డి, ఎమ్మెల్యే బీఎల్ఆర్


మిర్యాలగూడ పట్టణంలోని సాగర్‌రోడ్డులో రథయాత్రలో పాల్గొన్న భక్తులు

మిర్యాలగూడ టౌన్, జూలై 13: పట్టణంలో నిర్వహించిన జగన్నాథ రథయాత్ర వైభవంగా సాగింది. పెద్దబజారులో ప్రారంభమైన రథయాత్రకు మహిళలు మంగళహారతులతో ఘనంగా స్వాగతం పలికారు. భక్తివేదాంత ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో పరమహంస ప్రభుజీ అధ్యక్షతన నిర్వహించిన జగన్నాథుని రథయాత్రకు ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, మునిసిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి మాట్లాడుతూ లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ పట్టణంలో రథయాత్ర నిర్వహించడం గొప్ప విషయమన్నారు. ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ జగన్నాథుని ఆశీస్సులతో వర్షాలు కురిసి నియోజకవర్గం సస్యశ్యామలంగా మారాలని ఆకాంక్షించారు. భగవంతుని, ప్ర కృతి వనరులను పూజిస్తే సమాజం చల్లగా ఉంటుందన్నారు. రథయాత్రను తిలకించేందుకు పట్టణ, పరిసరప్రాంత భక్తులు వందలాదిగా తరలిరాగా నిర్వాహకులు అన్నప్రసాదం పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాగుబండి జనాబాయి, విశ్వనాథం, చెన్నా శ్రీనివాస్, చిల్లంచర్ల శ్రీనివాస్, తెడ్ల కిరణ్, గుడిపాటి ప్రకాష్, లక్ష్మి, పుష్పలత తదితరులు పాల్గొన్నారు.


రథయాత్రలో రథం లాగుతున్న ఎమ్మెల్సీ కోటిరెడ్డి, ఎమ్మెల్యే బీఎల్ఆర్

హిందూ సమాజం కోసం పనిచేస్తున్న ఆర్ఎస్ఎస్


సమావేశంలో మాట్లాడుతున్న ప్రభాకర్‌రెడ్డి

నాగార్జునసాగర్, జూలై 13: దేశంలో ఆర్ఎస్ఎస్ 99 సంవత్సరాలుగా హిందూ సమాజం కోసం పని చేస్తుందని ఆర్ఎస్ఎస్ జిల్లా బౌద్ధిక్ ప్రముఖ్, ఉమ్మడి జిల్లా గ్రామ వికాస సంయోజన వ్యవహర్త గుర్రం ప్రభాకర్‌రెడ్డి అన్నారు. శనివారం నాగార్జున సాగర్ హిల్‌కాలనీలో విజయవిహార్ అతిథిగృహంలో నిర్వహించిన గురు పూజ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సమర్పణ భావాన్ని పెంపొందించడమే ఆర్ఎస్ఎస్ లక్ష్యమని అన్నారు. ప్రతి ఆషాఢ పౌర్ణమిని పురస్కరించుకొని వ్యాస భగవానుని జయంతిని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు శ్రీనివాస్, నారాయణరెడ్డి, వెంకటేశ్వర్లు, రాజు, మిట్టపల్లి శ్రీను, నాగరాజు, రవి, నరసింహమూర్తి, పట్టాభి నరేష్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

శాలిగౌరారం, జూలై 13: ఆత్మహత్యాయత్నం చేసుకున్న వృద్ధుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ సంఘటన మండలంలోని మాదారం గ్రామంలో శనివారం జరిగింది. ఎస్ఐ సైదులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని మాదారం కలాన్ గ్రామానికి చెందిన జెరిపోతుల పుల్లయ్య (70) వృద్ధుడు కొంత కాలం నుంచి అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. జీవితంపై విరక్తి చెంది ఈ నెల 8వ తేదీన ఇంట్లో ఎవరూ లేని సమయంలో పత్తి చేనులో కొట్టే పురుగుల మందు తాగాడు. దీంతో గమనించిన అపస్మారక స్థితిలో ఉండగా కుటుంబ సభ్యులు విషయం తెలుసుకొని చికిత్స నిమిత్తం నల్లగొండలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుని కుమారుడు జెరిపోతుల వెంకన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్ఐ సైదులు తెలిపారు.

లబ్ధిదారులకు ఉచిత విద్యుత్ అందించాలి

నల్లగొండరూరల్, జూలై 13: గృహజ్యోతి పథకం దరఖాస్తుల నమోదులో జరిగిన పొరపాట్లను సవరించి, అర్హులైన లబ్ధిదారులకు ఉచిత విద్యుత్ అందించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. గృహజ్యోతి పథకంలో దరఖాస్తు చేసుకున్న అనేక మంది అర్హులకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందడం లేదన్నారు. దరఖాస్తు వివరాల నమోదులో అధికారుల తప్పుల కారణంగా అర్హులైన వారికి ఉచిత విద్యుత్ అందడం లేదన్నారు. వెంటనే సమస్యను పరిష్కరించాలని ఆయన కోరారు.

మృతుని కుటుంబానికి మంత్రి కోమటిరెడ్డి ఆర్థికసాయం


నగదు అందజేస్తున్న కాంగ్రెస్ నాయకుడు ఊశయ్య

నార్కట్‌పల్లి, జూలై 13: మండలంలోని మాండ్ర గ్రామానికి చెందిన పంగ రాజు అనే యువకుడు ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. అతనికి భార్య ఇద్దరు పిల్లలు ఉండగా ప్రస్తుతం ఆమె గర్భవతి. పంగ రాజు మృతి చెందిన విషయం కార్యకర్తల ద్వారా తెలుసుకున్న మంత్రి కోమటిరెడ్డి ఔదార్యం చూపారు. వెంటనే తక్షణ సాయంగా రూ.లక్ష నగదును కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బత్తుల ఊశయ్య ద్వారా బాధిత కుటుంబ సభ్యులకు శనివారం అందజేశారు. అంతే కాక పిల్లల చదువుకు అయ్యే ఖర్చులను కూడా తానే భరిస్తానని బాధిత కుటుంబ సభ్యులకు మంత్రి వెంకట్‌రెడ్డి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు దొండ రమేష్, వడ్డే భూ పాల్‌రెడ్డి, దాసిరెడ్డి సత్యనారాయణరెడ్డి, బండ శ్రీకాంత్‌రెడ్డి, గుండు నర్సింహ, పంగ రామలింగయ్య, యాట కృష్ణయ్య, వెంకన్న, దొండ మచ్చగిరి, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

పీర్ల కొట్టం ఏర్పాటుకు విరాళం

మునుగోడు రూరల్, జూలై 13: మండలంలోని చల్మెడ గ్రామంలో ఉత్సవ కమిటీ సభ్యుల కోరిక మేరకు పీర్ల కొట్టం ఏర్పాటుకు స్థలం కొనుగోలు కోసం కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ నాయకుడు మేకల ప్రమోద్‌రెడ్డి రూ. 1లక్ష ఆర్థికసాయం అందజేశారు. శనివారం నిర్మాణ కమిటీ సభ్యులకు ఆయన నగదును అందజేశారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు బాతరాజు సత్తయ్య, బాతరాజు నర్సింహ, బాతరాజు శంకరయ్య, పగిళ్ల యాదయ్య, షేక్ జానీ, కొంక అంజయ్య, కొంక పెంటయ్య, కొంక కాశయ్య, కొంక నర్సింహ, కొంక చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.


విరాళం అందజేస్తున్న మేకల ప్రమోద్‌రెడ్డి

సంక్షిప్త సమాచారం...

చింతపల్లి: గ్రామాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించేందుకు ప్రత్యేక అధికారులు చొరవ చూపాలని మాజీ వైస్ ఎంపీపీ శత్రుఘ్నరాజు అన్నారు. మండలకేంద్రంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పారిశుధ్యం లోపించడంతో ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

కట్టంగూరు: అప్పులబాధతో కట్టంగూరులో ఉరివేసుకొని చనిపోయిన చేనేత కార్మికుడు ఏలే శంకరయ్య కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంజి మురళీధర్ కోరారు. మృతుని కుటుంబానికి రూ.10లక్షల నష్టపరిహారం చెల్లించాలని కోరారు.

శాలిగౌరారం: మండలంలోని భైరవునిబండ గ్రామానికి చెందిన వేముల పద్మకు మంత్రి వెంకట్‌రెడ్డి సహకారంతో మంజూరు చేసిన రూ. 60 వేల చెక్కును మాజీ సర్పంచ్ దండ రేణుక అశోక్‌రెడ్డి అందజేశారు.

శాలిగౌరారం: నకిరేకల్ నుంచి వయా పెర్కకొండారం, మాదారం, వంగమర్తి, అర్వపల్లి మీదుగా తిరుమలగిరికి బస్సు సౌకర్యం కల్పించాలని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి గన్నపురెడ్డి బిక్షంరెడ్డి మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేశారు.

దేవరకొండ: చెన్నారావుపేట మండలం చింతల్‌తండాలో గిరిజన అమ్మాయిని ప్రేమ పేరుతో మోసం చేసి లొంగకుంటే ఆమె తల్లిదండ్రులపై వేట కొడవలితో దాడి చేసిన ఉన్మాది నాగరాజుపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ గిరిజనసమాఖ్య రాష్ట్ర ప్రధానకార్యదర్శి రమావత్ అంజయ్యనాయక్ డిమాండ్ చేశారు. నాగరాజును కఠినంగా శిక్షించి తీవ్రంగా గాయాలపాలైన వారికి వైద్యసేవలు అందించాలని కోరారు.

మర్రిగూడ: మద్యం బెల్ట్‌షాపుల వల్ల ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారని ఈ మేరకు బెల్ట్‌షాపుల నిర్మూలన కోసం ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మాజీ ఎంపీటీసీ వెంకటంపేట బాలయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రాందాసు శ్రీనివాస్ పిలుపునిచ్చారు. మండలంలో ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి ఆదేశాల మేరకు మద్యం నిర్మూలన కమిటీ ఏర్పాటు చేసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో చంద్రశేఖర్, అంజయ్య, యాదయ్య, ఎండీ బాబా, యశ్వంత్, శేఖర్, ఈదమ్మ పాల్గొన్నారు.

మిర్యాలగూడ టౌన్: ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేసినట్లు మినా మహిళా ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ ఎండీ. మహిమూద్‌అలీ తెలిపారు. హైదరాబాద్‌లో శనివారం నాణ్యమైన ఇంజనీరింగ్ విద్య అనే అంశంపై నిర్వహించిన కార్యక్రమానికి సీఎం రేవంత్ హాజరయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కళాశాలలు సమస్యలతో సతమతమవుతూనే సాంకేతిక విద్యనందిస్తున్నాయన్నారు. రాష్ట్రంలో సాఫ్ట్‌వేర్ రంగాన్ని ప్రోత్సహించి యువ ఇంజనీర్లకు ఉద్యోగావకాశాలు కల్పించాలని కళాశాలల యజమాన్యాల ఆధ్వర్యంలో సీఎంను కోరినట్లు తెలిపారు.

కేతేపల్లి: మూసీ ప్రాజెక్టు కుడికాల్వ పరిధిలో వానాకాలం పంటల సాగుకు నీటిని విడుదల చేసేలా కృషి చేయాలని కోరుతూ పలువురు రైతులు కోరారు. కేతేపల్లి మండల పరిధిలోని గ్రామాలకు చెందిన పలువురు రైతులు, రైతు సంఘాల నాయకులు నకిరేకల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన్ను కలిసి ఎమ్మెల్యే వేముల వీరేశానికి వినతిపత్రం అందజేశారు. ఆయకట్టుకు సాగునీటిని అందించడం ద్వారా ప్రాజెక్టు నీటిమట్టాన్ని కొంత మేర తగ్గిస్తే భవిష్యత్తులో వచ్చే వరద నీటితో ప్రాజెక్టును మళ్లీ పూర్తిస్థాయి నీటిమట్టానికి చేర్చి యాసంగి పంటల సాగుకు సైతం సాగునీటిని అందించే వెసులుబాటు కలుగుతుందని వారు తెలిపారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే వీరేశం సాగునీటి విడుదలపై మూసీ అధికారులతో మాట్లాడి తగిన చర్యలు తీసుకుంటానని వారికి హామీ ఇచ్చినట్లు రైతులు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు నంద్యాల సోమిరెడ్డి, మందడి వెంకట్రాంరెడ్డి, నరేందర్, మాధవరెడ్డి, వెంకట్‌రెడ్డి, అశోక్ పాల్గొన్నారు.

నల్లగొండరూరల్: తెలంగాణ రోడ్డు రవాణా సంస్థ డిపో, కార్గో ఎగుమతి, దిగుమతులు నిర్వహిస్తున్న హమాలీలకు కూలీ రేట్లు, స్వీపర్లకు వేతనాలు పెంచాలని తెలంగాణ ఆల్ హమాలీ వర్కర్స్ ఫెడరేషన్ (సీఐటీయూ) జిల్లా కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం అందించారు.

దేవరకొండ: రేషన్‌బియ్యాన్ని అక్రమంగా తరలిస్తే పీడీ యాక్టు కేసులు నమోదు చేసి కఠినచర్యలు తీసుకుంటామని దేవరకొండ డివిజన్ పౌరసరఫరాలశాఖ డీటీ శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. దేవరకొండ నుంచి ఆటోలో నాగర్‌కర్నూల్ జిల్లా చారకొండకు అక్రమంగా తరలిస్తున్న ఆరు క్వింటాళ్ల రేషన్‌బియ్యాన్ని పట్టుకొని బియ్యాన్ని తరలిస్తున్న తేలుకుంట్ల రమేష్‌పై కేసు నమోదు చేసి పోలీసులకు అప్పగించినట్లు ఆయన పేర్కొన్నారు. పట్టుకున్న బియ్యం, ఆటోను పోలీసులకు అప్పగించినట్లు తెలిపారు.

లారీని వెనుక నుంచి ఢీకొట్టిన మరో లారీ

- యజమాని మృతి, డ్రైవర్‌కు గాయాలు

ఒంగోలు(క్రైం), జూలై 13: ఒంగోలు సమీపంలోని కొప్పోలు ప్లై ఓవర్ బ్రిడ్జి సమీపంలో జాతీయ రహదారిపై రెండు లారీలు ఢీకొనగా ఒకరు మృతి చెందగా, మరొకరు గాయపడ్డారు. ఈ సంఘటన శనివారం తెల్లవారుజామున జరిగింది. ఈ ప్రమాదంలో లారీ యజమాని పెద్దవూర మండలం చలకుర్తి గ్రామానికి చెందిన తుమ్మలపల్లి గోవిందరెడ్డి (40) మృతిచెందగా, డ్రైవర్ మల్లేపల్లి ప్రభాకర్‌కు గాయాలయ్యాయి. వివరాలోకి వెళితే.. కృష్ణపట్నం నుంచి బొగ్గు లోడుతో రెండు లారీలు గుంటూరు వైపునకు వెళ్తున్నాయి. నిద్రమత్తులో ముందు వెళ్తున్న లారీని వెనుక నుంచి రెండో లారీ ఢీకొంది. దీంతో వెనుక ఉన్న లారీ క్యాబిన్ ముందు ఉన్న వాహనంలో ఇరుక్కుపోయింది. ఈ క్యాబిన్‌లో ఉన్న డ్రైవర్ ప్రభాకర్, యజయాని గోవిందరెడ్డి చిక్కుకుపోయారు. సుమారుగా గంటసేపు అగ్నిమాపక సిబ్బంది, ఒంగోలు తాలుకా ఎస్ఐ పావని తమ సిబ్బందితో శ్రమపడి వారిని బయిటకు తీశారు. అయితే అప్పటికే గోవిందరెడ్డి చలనం లేకుండా ఉన్నారు. డ్రైవర్ ప్రభాకర్‌కు గాయాలయ్యాయి. ఇరువురిని 108 వాహనంలో రిమ్స్‌కు తరలించగా గోవిందరెడ్డి మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ మేరకు ఎస్ఐ పావని కేసు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా ఈ సంఘటనలో సుమారుగా గంటసేపు రహదారిపై ట్రాఫిక్ స్తంభించింది. అనంతరం పోలీసులు వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించారు.